సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,17 జూలై 2024

జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

- కూటమి ప్రభుత్వంలో
ప్రతి సామాన్యుడికి వైద్యం అందుబాటులో ఉండాలి

జగ్గంపేట, మేజర్‌న్యూస్ : స్థానిక గుర్రంపాలెం రోడ్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి) ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంగళవారం పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్, ప్రసూతి వార్డ్, ఎక్స్రే రూమ్ వంటి అన్ని వైద్య సదుపాయాలను ఆయన పరిశీలించి డాక్టర్ టీ .ప్రణీత్, డాక్టర్ కే భాగ్యలక్ష్మి, డాక్టర్ పి వి నిషా, డాక్టర్ వి ఎస్ సంధ్య, డాక్టర్ ఆర్ మాధురి, డాక్టర్ ఎం. తేజ తదితరులతో సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడ జరుగుతున్న వైద్యం పేషంట్ల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వారివివరాలు అడిగి తెలుసుకున్నారు.కుటమి ప్రభుత్వంలో ప్రతి సామాన్యుడికి వైద్యం చేరువలోకి రావాలని ప్రభుత్వాసుపత్రిలలో ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా వైద్య సేవలందించాలని నెహ్రూ డాక్టర్లకు సూచించారు. అనంతరం వైద్యులు వైద్య సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బచ్చల సుధీర్, తోలేటి సూర్యనారాయణ, రాయి సాయి, నండ్ల చిరంజీవి, నేదురి గణేష్, కొంద్రోతు శ్రీను, కోడూరి రమేష్, పలివెల ఏసు రాజు, నాగిరెడ్డి అనిల్, దార్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి - తొలి ఏకాదశి విశిష్టత

కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి : హిందువుల తొలి పండుగ తొలి ఏకాదశి.ఈపర్వదినంతోనేపండగలు మొదలవుతాయి. వరసగా వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలు వస్తాయి. హైందవ సంస్కృతిలో తొలి ఏకాదశికి విశేష స్థానముంది. దీన్ని'శయన ఏకాదశి' , 'హరి వాసరం', 'పేలాలపండగ' అనికూడాపిలుస్తారు.తొలిఏకాదశి సందర్భంగా ఈపండగ విశిష్టత, పూజావిధానం ఇలా ఉంటుంది.ఒక ఏడాదిలో 24 ఏకాదశులు వస్తాయి. వీటిలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలిఏకాదశి'గా పిలుస్తారు.పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై నాలుగు నెలల పాటు శయనిస్తాడు. అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో వచ్చే ప్రబోధినీ ఏకాదశి రోజు ఆయన తిరిగి మేల్కొంటాడు. ఈనాలుగునెలల్నిచాతుర్మాసాలుగా వ్యవహరి స్తారు. తొలి ఏకాదశి నుంచి 4 నెలల పాటు చాతుర్మాస దీక్ష ను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు స్వామివారు పాతాళ లోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణగాథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది.

పూజకు పూజ.. ఆరోగ్యానికి ఆరోగ్యం

ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవించే కాలం కూడా ఇదే. కాబట్టి ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణా నియమాలుఆచరించాలి. అందువల్ల ఈ కాలంలో పెద్దలు వ్రతాలు, పూజలుఆచరించాలని నిర్దేశించారు. అంటే తొలి ఏకాదశి ఉపవాస దీక్ష ఆరోగ్య పరంగానూ మేలు చేస్తుంది. కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించాడని మరో కథ ప్రాచుర్యంలో ఉంది.ఆ రాక్షసుడితో శ్రీమహావిష్ణువు వెయ్యేళ్లు పోరాడి,అలసిపోయి ఓగుహలో విశ్రాంతి తీసుకుంటుండగా శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని అంతం చేసిందట. ఇందుకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకో మనగా తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకోవాలని కోరుకుం దట. నాటి నుంచి ఆమె 'ఏకాదశి'తిథిగా వ్యవహారం లోకి వచ్చింది. అప్పటిను ంచి సాధువులు, భక్తులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణుసా యుజ్యం పొందిన ట్లుగా పురాణాలు చెబుతు న్నాయి. అంబరీ షుడు, మాంధాత,తదితర పురాణ పురుషులు ఏకాదశి వ్రతాన్ని ఆచరించినట్లు రుషులు చెబుతారు.

ఏకాదశి పర్వదినాన ఏం చేయాలి..ఏకాదశి రోజున ఉపవాసం ఉండాలి. ఆరోజు రాత్రంతా జాగరణ చేయాలి. ఈ సమయంలో విష్ణుస హస్రనామ పారాయణ, విష్ణుమూర్తికి సంబంధించిన భాగవతాన్ని చదువుకోవడం లాంటివి చేయాలి. మరుసటి రోజైన ద్వాదశి నాడు సమీపంలోని దేవాలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి. తొలి ఏకాదశి రోజున ఆవులను పూజిస్తే విశేషఫలితాలు కలుగుతా యని చెబుతారు.తొలి ఏకాదశి నాడు పేలాల పిండిని తప్పక తినాలని పెద్దలు చెబుతారు. పేలాలు పితృదేవతలకు ఎంతో ఇష్టమైనవి. అంతేకాకుండా మనకు జన్మనిచ్చిన పూర్వీకులను పండగ రోజున గుర్తు చేసుకోవడం మన బాధ్యత.వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చే కాలం కాబట్టి మన శరీరం ఆరోగ్యపరంగా అనేక మార్పులకు లోనవుతుంది. గ్రీష్మ రు తువు ముగిసిన తర్వాత వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఈ సమయంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలగజేస్తుంది. అందువల్ల ఈరోజున ఆలయాల్లో, ఇళ్లలో పేలాల పిండిని ప్రసాదంగా పంచడం ఆనవాయితీగా వస్తోంది.తొలి ఏకాదశికి జిల్లా సర్వంగ సుందరంగా ముస్తాబయింది.

అన్ని వైష్ణవ క్షేత్రాలు వేకువఝామనే అభిషేకాలతో తెరుచుకోనున్నాయి. అన్న వరం సత్యనారాయణ స్వామి, పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ స్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ,కాకినాడ గాంధీనగర్, వెంకట్ నగర్, జగన్నాధపురంలోని వెంకటేశ్వర స్వామి, అదేవిధంగా జగన్నాధపురంలోని మరో వైష్ణవక్షేత్రం విష్ణాలయం, వాడ పల్లివెంకటేశ్వరస్వామి, అప్పన పల్లి బాలబాలాజీ స్వామి, అంతర్వేది, పుట్టకొండ, కోరు కొండ లక్ష్మీనరసింహస్వామి, తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి,సర్వవరం భావన్నా రాయణస్వామి, గొల్లలమామిడాడ సూర్యనారాయణ స్వామి ఇలా అన్నిఆలయాలలో తొలి ఏకాదశిపూజలు ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవాదాయ శాఖ పూర్తి ఏర్పాట్లు చేసింది.

ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి..

రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్రూటీ కుమార్)

కాకినాడ, మేజర్‌న్యూస్ : మాజీ కార్పొరేటర్, దివంగత ప్రముఖ వైకాపా నాయకులు రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్రూటీ కుమార్) జయంతి వేడుకలు నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్ కుమార్, కుడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి పేర్కొన్నారు. దివంగత ఫ్రూటీ కుమార్ అభిమానులు, కుటుంబ సభ్యులు పండుగ వాతావరణంలో తొలుత కాకినాడ దిగుమర్తివారి వీధిలో ఉన్న లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద ఫ్రూటీ కుమార్ జయంతిని పురస్కరించుకొని భారీ కేక్‌ను కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం జగన్నాధపురం రెయిన్‌బో హాస్టల్ విద్యార్థులకు నెల సరిపడేందుకు నిత్యవసర వస్తువులకు డబ్బులను మరియు పండ్లు, మిఠాయిలు, అందజేశారు. అంతేకాక కొండయ్యపాలెంలో గల మానవియా ఫౌండేషన్‌లో వృద్ధులకు అన్నదానంచేశారు. కల్పన సెంటర్ రోటరీ బ్లడ్ బ్యాంక్ ఎదురుగా శ్రీ బులుసు సాంబమూర్తి వికలాంగుల పాఠశాలలో విద్యార్థినులకు అన్నదానం, కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద నిరుపేద ప్రజలకుహాస్పిటల్‌లో రోగుల బంధువులకు భారీ ఎత్తున అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెదరని చిరునవ్వే నువు పంచిన ఆయుధం, పోరాడే గుణమే నువు ఇచ్చిన బలం..ఎన్నాళ్లు బతికాం అనేది కాదు ముఖ్యం.. బ్రతికినంత కాలం ఎలా బతికాం అనేది ముఖ్యం. మహానేత రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్‌ను చూసి నేర్చుకోవాలని, అటువంటి నాయకుడి పుట్టినరోజులు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రజలు మర్చిపోలేని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ఫ్రూటీ కుమార్ అని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలోరాగిరెడ్డి మణిరాజ్ కౌండిన్య, డాక్టర్. రాగిరెడ్డి నారాయణ స్వామి, రామలింగం, రఫీ ఖాన్, మిడిమిళ్ళ కుమార్, శ్రీను, రాజనాల విజయ సారథి, బోనం శంకరు, కర్రి వెంకటసుబ్బారావు, స్వప్న, కన్నా, బూడిద అరుణ్, మధు, కర్రి జగదీష్, భద్రం, వెంకన్న, మోహన్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రమాదంలో వ్యక్తి మృతి..

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఎర్రవరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం పెద్దాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన కనపర్తి సూర్యుడు(80) ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం, డైలీ వసూళ్లు కొరకు పేరవరం వెళ్లి, తిరిగి తన స్కూటీపై ఇంటికి వెళ్లేటప్పుడు ఎర్రవరం గ్రామ పరిధిలో పేరవరం జంక్షన్ వద్ద ఎన్ హెచ్ 16 రోడ్డు మంగళవారం ఉదయం సుమారు 8:30 గంటలకు రోడ్డు దాటుతుండగా,అదే సమయానికి విశాఖపట్నం వైపు నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న కారు డ్రైవర్ తన కారుని స్పీడ్ గా నడిపి, రోడ్డు దాటుతున్న కనపర్తి సూర్యుని గుద్దగా బలమైన గాయాలు తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు సూర్యుడికి ముగ్గురు అమ్మాయిలు ఒక అబ్బాయి సంతానం ఉన్నట్లు, వారందరికీ వివాహములు అయినట్లు, మృతుడు తన భార్య అయిన అమ్మాజీతో కలిసి గుడివాడ గ్రామంలో నివసిస్తున్నాడు కాగా కనపర్తి సూర్యుడు అల్లుడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జి సుబ్బు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాకినాడలో ఐదు అన్నా క్యాంటీన్లు

- ఆగస్టు 15 నుండి ప్రారంభం
- కమిషనర్ జే.వెంకటరావు వెల్లడి
- ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ,మేజర్‌న్యూస్ : జిల్లా కేంద్రం కాకినాడలో ఆగస్టు 15 నుంచి ఐదు ప్రాంతాలలో అన్నా క్యాంటిన్లను ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు చెప్పారు. మంగళవారం ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి అన్న క్యాంటీన్లను ప్రతిపాదించిన ప్రాంతాలను సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగన్నాధపురం అన్నమ్మగాటి, సంత చెరువు, వివేకానంద పార్క్, డైరీ ఫారం సెంటర్ బోట్ క్లబ్ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిపాదిత ప్రాంతాలలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని, గురువారం నాటికల్లా వీటిని ఖరారు చేస్తామని కమిషనర్ చెప్పారు. అన్న క్యాంటీన్‌ల ఏర్పాట్లను ఎస్ఈ పి.సత్య కుమారి పర్యవేక్షణలో ఒక్కో అన్న క్యాంటీన్‌కు డిఈ స్థాయి అధికారిని ఇన్చార్జిగా నియమించి పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఆగస్టు పదో తేదీ నాటికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు,ఈఈ మాధవి, డిఈ సుబ్బారావు, ఏఈ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

జగ్గారంలో ఘనంగా శీతల భవాని పండుగ

చింతూరు,మేజర్‌న్యూస్: అల్లూరి సీతారామరాజు జిల్లా,చింతూరు మండలంలోని ఏడుగురాళ్ళపల్లి గ్రామములోని జగ్గారంలో మంగళవారం ఘనంగా శీతల భవాని పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పండుగను లంబాడీలు యువతీ, యువకులు,పెద్దలు, చిన్న అందరు నిష్టతో జరుపుకుం టారు. పండుగ ముందు రోజూ గ్రామంలో పెద్దలు అందరూ ఒక దగ్గర సమావేశం అయ్యి పండుగ రోజును నిర్ణయిస్తారు. గ్రామంలో ఉండే ఖారభారి, నాయక్, లుంకాడియా ముగ్గురు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏడు అమ్మవారులు 1.శీతల భవాని 2.కెంకాలీ 3.తుల్జాభవని 4.హింగ్లా భవాని 5.ద్వరాంగ్లి భవాని 6.మెరమా 7.ఆనంతరం లుంకడియా (నీళ్ళు పోసే నీటి గుండం). అడవికి మేతకి వెళ్ళే మూగజీవులు మేత మేసిన తర్వాత మృగజీవుల భారిన పడకుండా రక్షించాలని, మంచి వర్షం పడి పంట పొలాలు మంచిగా పండాలని, అధిక వర్షాలు కురవాలి అని,చదువుకునే యువతీ, యువకులకు మంచి చదువు, ఆరోగ్యంతో ఉండేట్లు చూసుకోవాలని, పశు సంపద పెరుగుదల మరియు అవి ఆరోగ్యంగా ఉంచడానికి ఈ ఏడు భవానీలు కలిసి ఒక దగ్గరే కొలువుదీరినది అని తండవాసుల నమ్మకం. ఏజెన్సీలో తండా వాసులు అషాడమాసంలో జరుపుకునే మొట్టమొదటి పండుగ అని చెప్పవచ్చు. తండాలో ఈ పండుగను లంబాడీలు చిన్న పెద్ద,అడ మగ అందరు కలిసి ఐక్యంగా ఘనంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తేజావత్ రాము,లుంకాడియ గుగ్గులోత్ లాల్ చంద్, కార్భారీ గుగ్గులోత్ సురేష్, స్థానిక ఉప సర్పంచ్ బి.బాబూరావు, గ్రామ పెద్దలు పెంటయ్య, రవి, చందు, లోక్య, రాంబాబు, భూక్యా శంకర్, నారయ్య, కోటేశ్వరరావు, నాగు, భూక్యా కృష్ణ, నారాయణ, యూత్ సభ్యులు గోపి, వెంకటేష్, నరేష్, గాంధీ, కిషన్, దేవ, మోహన్, తేజవత్ రవి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేత

కొవ్వూరు,మేజర్‌న్యూస్ : టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పన పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో పేదలకు ప్రభుత్వ నిర్మించిన టిట్కో ఇళ్ళను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం లో20 శాతం పనులు నిలిచిపోయిన టిట్కో ఇళ్లను లబ్ధిదారులకు పంచకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నిర్మించిన ఇళ్లను పాడుబడ్డ గృహాలుగా తయారు చేశారని అన్నారు.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు రుణాలు తెచ్చుకుని వడ్డీలు కట్టుకుంటూ అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దెలు చెల్లిస్తున్నారని అన్నారు. కొవ్వూరు పట్టణానికి సంబంధించి 500 పైగా టిట్కోఇల్లునిర్మాణంఅయ్యే అన్నారు. ఐదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లను పరిశీలించడం జరిగిందని అన్నారు. అప్పటికి ఇప్పటికీ మంచినీటి పైపులైను పూర్తయింది అన్నారు. పట్టణం నుంచి టిట్కో ఇళ్లకు వెళ్లే మార్గం బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉందని దీనికి సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారన్నారు. అదే విధంగా ఇంటర్నల్ రోడ్లు నిర్మాణం, ఇతర సౌకర్యాలు కల్పించి సాధ్యమైనంత త్వరలో లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తామని అన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్లతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసిసత్వర చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలోటిడిపి నాయకులు కంటమణి రామకృష్ణ,సురపనేని చిన్ని, దాని రామకృష్ణ, తోరంగి నగేష్, కెవికె రంగారావు,సిఐ. యు. జగదీశ్వరరావు, ఏపీ టెట్కో డి ఈఈ తోవ ఆఫ్రిన్, ఏఈ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీస్థల యజమానులకు నోటీసులు

- పరిశుభ్రం చేయకపోతే చర్యలు
- కమిషనర్ జే.వెంకటరావు

కాకినాడ,మేజర్‌న్యూస్ : అపరిశుభ్రతకు, దోమల తీవ్రతకు కారణమవుతున్న ఖాళీ స్థలాల్లో నిలవ నీటిని వెంటనే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు స్థల యజమానులను కోరారు. ఇందుకు సంబంధించి కాకినాడ నగరపాలక సంస్థపరిధిలోని సుమారు 160 మంది స్థల యజమానులకు నోటీసులుజారీ చేశామన్నారు. మంగళవారం ఆయన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అక్కడి పనులు ప్రగతిని పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం జగన్నాధపురం రణదీప్ నగర్ ప్రాంతంలోని మేజర్ డ్రైన్ ని కూడా సందర్శించారు. అక్కడ గుర్రపుడెక్క పేరుకు పోవడానికి గుర్తించారు. తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న తూరంగి గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలవ ఉండడానికి గుర్తించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి పరిశుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా, నిర్లక్ష్యంగా వదిలిపెట్టడం వల్ల పిచ్చి మొక్కలు పెరిగి, డంపింగ్ యార్డుల్లా తయారై, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతున్నాఎన్నారు. ఈ విషయమై సిబ్బంది ప్రత్యేక ఫోకస్ పెట్టి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే పూడికతీత పనులు పూర్తయిన అనంతరం అక్కడి వ్యర్థాలను కూడా తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అద్వానంగా మారిన పంట కాలువలు

- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

గొల్లప్రోలు,మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే ఏలేరు గోదావరి నీటి జలాలను రైతుల పంట కాలువలకు విడుదల చేసే ప్రధాన కాలవలు 2014 నుండి పూడికతీతలు లేని కారణంగా ప్రతి పంటకాలువ చిట్టడవిని తలపిస్తూ కాలువల్లో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క పేరుకుపోయి రైతుల పంట కాలువలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని గొల్లప్రోలు మండలానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలేరు అధికరణ కొండకాలువ అభివృద్ధి పనులు, ఒబందా సీతానగరం కాలువ బలబద్రం ఇలా చిన్న పెద్ద సాగునీరు అందించే కాలువలు అభివృద్ధి పనులు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని కొన్ని పనులు నిలిచిపోయాయి. పిఠాపురం శాసనసభ్యుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిత్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం రైతుల పంట కాలువలు, రైతులకు దారి మార్గాలు, పండిన పంట ఇంటికి తెచ్చుకునేందుకు పుంత మార్గాలు రోడ్లు అభివృద్ధి పరిచి వరద నీరు రైతుల పంట పొలాల మీదకు వెళ్లకుండా ఏలేరు ఆధునికరణ పనులు ప్రారంభించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు చేపట్టాలని గొల్లప్రోలు మండలం రైతులు కోరుతున్నారు.

విజయ మోహన్‌కి మోడరన్ ప్రజహిత పురస్కారం

రామచంద్రపురం,మేజర్‌న్యూస్ : ప్రముఖ విశ్వావిద్యాలయం ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్య విభాగం డైరెక్టర్‌గా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ఎన్.విజయ్ మోహన్‌కి ప్రతిష్టాత్మక మోడరన్ ఫౌండేషన్ వారి ప్రజహిత పురస్కారాన్ని మంగళవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు విశాఖపట్నంలో అందజేసారు.

ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ డైరెక్టర్ విజయమోహన్ నేతృత్వంలో ఆంధ్ర యూనివర్సిటీ దూరవిద్యా విభాగం మరింత విశేషమైన సేవలు అందించాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు. డైరెక్టర్ విజయ మోహన్ మాట్లాడుతూ...గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు ఆలంబనగా నిలుస్తున్న మోడరన్ విద్యాసంస్థల నుండి పురస్కారం పొందటంఆనందదాయకంఅన్నారు.ఈ కార్యక్రమంలో మోడరన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

బడదనాంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 50 మందికి వైద్య సేవలు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని బండదనాంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు.ఎం ఎల్ పీహెచ్ సంపత్, ఏఎన్ఎం మహేశ్వరి, హెచ్వి రమాబాయి, 104 డి ఈ ఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్ రాజేశ్వరి వైద్య సేవలు అందించారు. 18న దూసర పాము, 19న తంటికొండ గ్రామాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు 104 డిఈఓ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో స్క్వాడ్ తనిఖీలు...

సామర్లకోట,మేజర్న్యూస్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను ఆర్టీసీ స్క్వాడ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. సామర్లకోట ఆర్టీసీ బస్టాండ్ కు వచ్చిన బస్సులను అధికారులు తనిఖీలు చేశారు. ప్రయాణికుల నుంచి టిక్కెట్లు పరిశీలించి ఎక్కడ నుంచి ఎక్కడకు వెళుతున్న సమాచారం సేకరించారు.అలాగేఆర్టీసీఅధికారులు సూర్యనారాయణ, ప్రసాదరావులు ఆర్టీసీ కండెక్టరు వద్ద ఉన్న చార్టును ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రయాణికులు ఆయా స్టేజ్లో దిగే వరకు టిక్కెట్టును వారివద్దే ఉంచుకోవాలని సూచించారు. టికెట్ లేకుండా చేసే ప్రయాణాలు నేరం అయినందున ప్రయాణీకులు అంతా టికెట్ తీసుకుని వారి ప్రయాణాలను సుఖవంతంగా చేసుకోవాలని స్క్వాడ్ అధికారుకు ప్రయానీకులకు సూచించారు.

ఉచిత ఇసుక కేటాయింపుల విషయంలో మార్గదర్శకాలు పాటించాలి

- కొవ్వూరు, తాళ్లపూడి గోదావరీ బండ్ మార్గంలో 360 డిగ్రీ నిఘా సిసి పర్యవేక్షణ

- ఇతర జిల్లాల కేటాయింపులకై ఆయా జిల్లాల డిఎల్ఎస్ఎ అభ్యర్థన తప్పనిసరి

- కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ : జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ లు, డిసిల్టేషన్ పాయింట్స్ వద్ద 3,77,357.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, గోదావరి కి వరద నీరు ప్రభావం దృష్ట్యా డీసీల్టేషన్ పాయింట్స్ వద్ద నిలువ ఉన్న ఇసుక వినియోగానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టర్ విడిది కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, భవన నిర్మాణాలకు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు ఉచిత ఇసుక పంపిణీ విధానంలో కేటాయింపులు జరుపవలసి ఉందన్నారు. బల్క్ కేటాయింపుల విషయంలో జిల్లా స్థాయి కమిటీలో చర్చించి సభ్యుల ఆమోదం అనుసరించి కేటాయింపులను చేపట్టడం జరుగుతున్నట్లు తెలియ చేసారు. అదే విధంగా ఇతర జిల్లాలకి సంబంధించి సంబంధిత జిల్లా కలెక్టర్ / డి ఎల్ ఎస్ ఏ ద్వారా వొచ్చిన సిఫార్సులను అనుసరించాల్సి ఉంటుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. వీటిపై విజిలెన్స్ ఆయా జిల్లాల పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని అవసరాలకి అనుగుణంగా ఇసుక లభ్యత విషయంలో ఎటువంటి లోటు లేకుండా పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం గోదావరి ఉధృతి ప్రతీకూల పరిస్థితి మేరకు స్టాక్ పాయింట్స్ వద్ద ఉన్న నిలువ కంటే ముందుగా డీసీల్టేషన్ వద్ద ఉన్న నిలువలని గుర్తించి కేటాయించాల్సి ఉందన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో వున్న ఇసుక నిలవ అంచన వేయాలని అధికారుల ఆదేశించారు. వరదలకు కారణంగా ఆయా పాయింట్స్ వద్ద ఉన్న ఇసుక నీటి ప్రవాహానికి కొట్టుకుని పోయే అవకాశం ఉందని తెలిపారు. బల్క్ కేటాయింపుల విషయంలో డి ఎల్ ఎస్ ఏ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. వ్యక్తిగత నిర్మాణాలకు చెందిన నియమ నిబంధనలు అనుసరించి ఆధార్, ప్లాన్, పంచాయతీ అధికారి ధృవీకరణ పరిగణనలోకి తీసుకోవడం జరుగుతోందని అన్నారు. ఆయా లావాదేవీలకు చెంది సబ్, ఇతర సమన్వయ అధికారులు విజిలెన్స్ విషయంలో అప్రమత్తత కలిగి ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవో లు వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరీ బండ్ మార్గంలో 360 డిగ్రీ నిఘా సిసి పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఏడు ఇసుక స్టాక్ పోయింట్ లు, 31 డిసిల్టేషన్ పాయింట్స్ వద్ద సోమవారం సాయంత్రం నాటికి 3,77,357.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో , ఇతర ప్రవేటు ఏజెన్సీలకి చెందిన బల్క్ కేటాయింపుల కోసం ఏడు ప్రతిపాదనలు వచ్చినట్లు తెలియ చేసారు. వాటికి నిబంధనలు అనుసరించి కమిటీ ఆమోదం తెలపడం జరిగింది.

ఈ సమావేశంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ కె. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు , ఆర్డీవో ఏ. చైత్ర వర్షిణి , జిల్లా మైన్స్ సహాయ సంచాలకులు ఎం. సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పి వి. సోమ శేఖర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై. శ్రీనివాస్, ఇరిగేషన్ ఈ ఈ – జి. కాశీ విశ్వేశ్వర రావు, ఆర్టీవో కె వి కృష్ణారావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ – డి బాల శంకర రావు, డిపిఓ డి.రాంబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్లోరినేషన్ విధానానికి శ్రీకారం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పంచాయతీ వాటర్ ట్యాంక్‌లలో నీటిని శుభ్రపరచడానికి అధికా రులు ఆన్‌లైన్ క్లోరినేషన్ విధానానికి శ్రీకారం చుట్టారు. పెద్దాపురం మండలంలో కాకినాడ జిల్లా డిపిఓ సౌజన్య భారతి, డిఎల్‌పిఓ ఎం.బాలా మణి, ఎంపిడిఓ ఎం.ఉషారాణి ఆదేశాల మేరకు ఇఓ & పిఆర్‌డి నక్కా సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఈ విధానాన్ని అమలు చేశారు. నీటి కలుషితం కారణంగా డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటర్ ట్యాంక్ రోజూ క్లోరినేషన్ చేసిన తరవాతే నీటిని విడుదల చేయాలని, ఉన్నతాధికారులు ఆదేశాల ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ క్లోరినేషన్ విధానాన్ని తీసుకువచ్చినట్లు ఇఓ & పిఆర్‌డి సత్యనారాయణమూర్తి తెలిపారు. మంచినీటిని ట్యాంక్‌లకు పంపించే సమయంలో అవే గొట్టాలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గొట్టాల అమరిక ద్వారా బ్లీచింగ్ ద్రావణాన్ని ట్యాంక్‌కు పంపిస్తారని, ట్యాంక్ నిండిన రెండు గంటల తరువాత పంచాయతీ కుళాయిలకు స్వచ్ఛమైన త్రాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇఓ & పిఆర్‌డి నక్కా సత్యనారాయణ మూర్తి తెలుపుతూ ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు జ్యోతుల పద్మరాజు, గ్రేడ్ 5 సెక్రటరీ బంగార్రాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అనపర్తి, మేజర్ న్యూస్ : అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులుఅభిమానులు మొక్కుకున్న మొక్కులను మంగళవారం తీర్చారు.గతఅనపర్తిఅసెంబ్లీఎన్నికల్లో రామకృష్ణారెడ్డి అఖండ విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ మూలారెడ్డి కుటుంబానికి సన్నిహితములను, రామకృష్ణారెడ్డికి అభిమానులుగా ఉన్న రామవరంగ్రామానికి చెందిన మండ అబ్బాయి రెడ్డి దంపతులు, మండసతీశ్వర రెడ్డి దంపతులు రామవరం గ్రామంలోని భక్త ఆంజనేయస్వామికి మొక్కుకున్న మొక్కులను మంగళవారం రామకృష్ణారెడ్డి దంపతులుస్వామి వారికి చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండ అబ్బాయి రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచిన కారణంగా రామవరం గ్రామంలో వెలసియున్న శ్రీ భక్త ఆంజనేయస్వామి వారికి 108 కొబ్బరికాయలు కొడతామని మొక్కుకోవడం జరిగిం దన్నారు. స్వామివారి గుడిలో ఎమ్మెల్యే దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించికొబ్బరికాయలుకొట్టించిమొక్కు తీర్చుకున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు రామవరం గ్రామ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు, బాలల పరిరక్షణకు మిషన్ శక్తి - ఐసిడిఎస్ పిడి కె.ప్రవీణ

పెద్దాపురం,మేజర్న్యూస్ : మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు వంటి ఇబ్బందుల నుంచి వారిని పరిరక్షించేందుకు మిషన్ శక్తి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ అన్నారు. మంగళవారం పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పెద్దాపురం నియోజకవర్గంలోని అంగన్‌వాడీలకు మారిన మహిళా చట్టాలు, మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, బాలల అక్రమ తరలింపులు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం సిడిపిఓ జి.ఉష ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడి ప్రవీణ పాల్గొని మాట్లాడుతూ మహిళలపై వేధింపులు జరిగినా, బాలలు అదృశ్యంపై, బాల్య వివాహాలు జరుగుతున్నా, పని ప్రదేశంలో మహిళలు వేధింపులకు గురవుతున్న చైల్డ్ లైన్ హెల్ప్ టోల్ ఫ్రీ నెం.1098/112కు ఫిర్యాదు చేసే విధంగా మహిళలకు, యువతకు, బాలలకు అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ సిబ్బందికి ఆమె సూచించారు. సిడబ్లూసి మెంబర్ సంతోష కుమారి, స్వచ్ఛంద సంస్థ కమ్యూనికేటర్ బి.లక్ష్మీ తదితరులు చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమ, చంద్రకళ, మంగ, బేబి, వెంకటలక్ష్మీ, అంగన్‌వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర రైతులు సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం

- అసెంబ్లీ సమావేశాలలో మీ సమస్యపై ముఖ్యమంత్రికి తెలియజేస్తారని నెహ్రూ హామీ

జగ్గంపేట, మేజర్ న్యూస్ : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు పోలవరం ప్రాజెక్టుకు భూసేకరణలో భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చిన రైతులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు బత్తుల వెంకట రమణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంగవరం మండలం గిరిజన ప్రాంతాలలో భూములు కలిగిన గిరిజనేతర రైతులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భూములు ఇవ్వడానికి ముందరకు వచ్చామని స్పెషల్ కలెక్టర్ మావద్ద అసలైన భూపత్రాలన్నీ తీసుకుని మా భూములు తీసుకోవడానికి అన్ని సర్వేలు చేసి అన్ని నోటిఫికేషన్లు ఇచ్చి అన్న ఎంక్వయిరీలు చేసి మాకు నష్టపరిహారం ఇచ్చే టైం కి వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోకపోవడంతో మాకు న్యాయం జరగలేదు. మా భూ పత్రాలన్నీ వారి దగ్గరే ఉంచుకుని మాపై ఎల్ టి ఆర్ పి కేసులని పెట్టి మమ్మల్ని అన్ని రకాలుగా ఇబ్బందులు గురిచేసిన కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య పై చర్యలు తీసుకోవాలని మాకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని కలిసామని ఆయన సానుకూలంగా స్పందించి రాబోయే అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి బుజ్జి, జాజుల ఫణీ బాబు, బలస సునీల్, బలస నాగేశ్వరరావు, జాజుల శ్రీను, తదితర రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్: ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వితేజ్ సూచనల మేరకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన రైతులు టోల్ ఫ్రీ నెం.1912కి ఫోన్ చేయవచ్చునని ఎపిఇపిడిసిఎల్ సిఎండి ఒక ప్రకటనలో తెలిపారని, పెద్దాపురం ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఏ.వి.ఎన్.డి.ఎన్.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని వివిధ మీ–సేవ కేంద్రాలు, గ్రామ / వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుం దన్నారు. ఈ కార్యాలయాలలో కొత్త వ్యవసాయ కనెక్షన్‌లు నమోదులో పత్రాన్ని అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందుకే రైతులు నేరుగా ఎపిఇపిడిసిఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ కార్డ్, రిజిస్టర్డ్ ఫోన్ నెంబర్లు, పట్టాదారు పాస్‌బుక్, సర్వే నెంబర్లు, వాల్టా సర్టిఫికెట్ నెం, కుల ధృవీకరణ పత్రం వంటి వివరాలను తెలియజేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఏ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ సూచించారు.

ఘనంగా ప్రారంభమైన రాష్ట్రాస్థాయి మోడరన్ పెంటాథలాన్ క్రీడలు

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో 8వ రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథలాన్ ట్రయాథలాన్, బయాథలాన్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలలో భాగంగా మంగళ వారం ట్రయాథలాన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక మానికి ముఖ్యఅతిథిగా మోడరన్ పెంటాథలాన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.చప్పిడి వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, డీఎస్ఎ కోచ్ అప్పల నాయుడు, అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు జగన్, శ్రీహరి, బి.ప్రసాద్, పిడిలు వనుం ఉపేంద్రనాథ్, గాలి రవికృష్ణ, చంద్రశేఖర్, కరుణ, సూర్యపాల్, రాయపురెడ్డి బాబి, డి. ప్రసన్నకుమార్ మరియు 10 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం అవాస్తవం

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : ఎన్ ఎన్ ఎం ఈ లూథరన్ దేవాలయంలో నిధుల దుర్వినియోగం అంటూ చేస్తున్నవి తప్పుడు ఆరోపణలు మాత్రమేనని ఎంత మాత్రం నిజం కావని ఆ సంఘ కాపరి మరియు చైర్మన్ రెవరెండ్ సరెళ్ళ అనిల్ కిరణ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ధవళేశ్వరం లూథరన్ చర్చిలో జరిగిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. కొంతమంది నిరాధారమైన వాస్తవ దూరమైన ఆరోపణలు చేస్తూ సంఘ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. రెవరెండ్ గుర్రపు కిరణ్ బాబు మరియు అతని అనుచరులు గత నెల రోజులుగా సంఘంలో అశాంతికి కారణమవుతూ ఆరాధనను అడ్డుకుంటూ అలజడులు రేపుతున్నారని ఐదేళ్ల కాల పరిమితితో తాను ప్యారిస్ పాస్టర్ గా కొనసాగుతుడగా సరియైన నియామక పత్రాలు లేకుండా తానే పాస్టర్ అంటూ గొడవలు చేస్తున్నారని దీనిపైన ఏ ఈ ఎల్సి కేంద్ర మోడరేటర్ బిషప్ స్పందించి సకనేటిపల్లి సంఘానికి బదిలీ చేసినప్పటికిని వెళ్లకుండా తన సంఘంలో గొడవలు రేపుతున్నారని విమర్శించారు. కోశాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ 80 లక్షలు దుర్వినియోగం అయినట్లు ప్రచారం చేస్తున్నారని దాన్ని నిరూపిస్తే వారు తీసుకునే ఏ చర్యకైనా సిద్ధమేనని కానిపక్షంలో అటువంటి వారిపై సివిల్ క్రిమినల్ చర్యలు తాను తీసుకుంటానని హెచ్చరించారు .ఇదిలా ఉండగా గత ఐదు వారాలుగా పోలీసు రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని ఇరుపక్షాలకు కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికిని గొడవలు సద్దుమనగలేదు.

దీంతో ఇరు వర్గాల నియామక పత్రాలు పరిశీలించి ఆరాధన చేయడానికి అనిల్ కిరణ్ కు వీలు ఉందని తేల్చారు. గొడవలు పడకుండా ఉండమని చెబుతూ తమపై 13 మందికి బైండోవర్ కేసులను పెట్టారని అధికారులు తమకు సహకరిస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు రెవెన్యూ పోలీసు లపై చేయడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా తమకు ఆర్డర్ ఇచ్చారని చెబుతున్న సినదు బిషప్ నుండి స్పష్టమైన నియామక పత్రాన్ని తాజాగా మండల మెజిస్ట్రేట్ ముందు ఉంచి సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చి తమ నిజాయితీని నిరూపించుకోవాలని అడహాక్ కమిటీ సభ్యులు కోరారు. కాగా ఈ సమావేశంలో అసిస్టెంట్ పాస్టర్ సూర్య తేజ ,కే పాల్ మహేష్ ,బీరా బాబురావు, సరెళ్ళ రాజు, వీ రోహిణి ,జి జె లలిత మోజస్ కిలాడి అరుణ ,చంద్ర కుమారి అమ్మాజీ , ఎం.సత్యస్కరరావు, ఎం కిషోర్ కుమార్, గుత్తాల దేవానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు త్వరితగతిన చట్టపరంగా న్యాయం జరగాలి

- శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్

పెరవలి,మేజర్న్యూస్ : పశ్చిమ గోదావరి జిల్లావిజిలెన్సు అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం జూలై 16వ తేదీ మంగళవారం భీమవరం కలెక్టర్ ఆఫీస్ నందు కలెక్టర్ సి నాగరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు వంకరవీంద్రనాథ్ మాట్లాడుతూ దళితులకు చట్టపరంగా ఎటువంటి జాప్యం జరగకుండా సంఘంలో అందరితో సమ న్యాయం కలుగుతుందనే నమ్మకం కలగచేయడమే ఈ చట్టం లక్ష్యమని అన్నారు. వారు దౌర్జన్యానికి శారీరక మానసిక వేదనకు గురి కాబడితే చట్టపరంగా తగిన ఆర్థిక తోడ్పాటు త్వరితగతిని అందించాలని శాసన మండలి సభ్యులు వంక రవీంద్ర నాథ్ అన్నారు .స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ కొన్ని చోట్ల షెడ్యూల్ కులాలు తెగల వర్గాలపై సాంఘిక దాడులు వివక్షత కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. నాగరిక సమాజం లో ఇటువంటి సంఘటనలకు తావీయరాదని శాసన మండల సభ్యులు రవీంద్ర నాథ్ అన్నారు. ఈ సమావేశంలో భీమవరం శాసన సభ్యులు అంజిబాబు, ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు,మోనిటరీ కమిటీ సభ్యులు, జాయింట్ కలెక్టర్ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొని పెండింగ్ కేసుల వివరాలగురుంచి చర్చించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి వకులమాత అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం బిక్కవోలుకు చెందిన కోశెట్టి ఆనందరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష, కొత్త తుంగపాడుకు చెందిన దొడ్డ వెంకట లక్ష్మి కుటుంబ సభ్యులు రూ.12,116లు విరాళంగా అందించారు.

వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

18 నుండి జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

- మండల కమిటీ అధ్యక్షులు బొద్ధిరెడ్డి త్రిమూర్తులు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మండలంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు రాజవొమ్మంగి మండల కమిటీ అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు తెలిపారు.

క్రియాశీలక సభత్వంతో పాటు 5 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని, ప్రమాదంలో గాయపడిన సభ్యులకురూ 50 వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు.. ఈ నెల 18 నుండి 28 వరకు జనసేనసభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే జనసైనికులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు.

ఫోటో ,ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్సు తోపాటు రూ 500 కట్టి పార్టీలో క్రియాశీలక సభ్యత్వం పొందాలని ఆయన కోరారు. గత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గంలోనే రాజవొమ్మంగి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఇప్పుడు అంతకు మించి సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నట్లు మూర్తి స్థానిక విలేకరులకు తెలిపారు.

ఉపాధి శిక్షణలకు ఆహ్వానం

సామర్లకోట, మేజర్ న్యూస్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త అధ్వర్యంలో సామర్లకోట టిటిడిసి శిక్షణా కేంద్రంలో ఉచితంగా భోజన వసతి సదుపాయంతో నిరుద్యోగ యువతిలకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నట్టు డిఆర్డిఎ పిడి శ్రీ రమణి, జిల్లా జాబ్స్ మేనేజర్ ఎం సంపత్ కుమార్ లు తెలిపారు. మంగళవారం వారు ఒక ప్రకటనలో తెలుపుతూ ఉభయ తూర్పు గోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతులకు శిక్షణాలతో పాటు ఉపాధి అవకాశలు కల్పిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సారీస్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ కోర్స్ కాలం 15 రోజులు ఉంటుందన్నారు. ఈ కోర్సులో చేరే యువత వయస్సు 18 నుండి 40 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. అలాగే వారి విద్యార్హత 8వ తరగతి ఆపై ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణా యువతిలకు మాత్రమే ఈ అవకాశం ఉన్నందున ఈ అవకాశన్ని ఊయోగించుకుని ఉపాధి పొందాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

బదలీపై వెళుతున్న ఎస్పీ శ్రీధర్‌కు అపూర్వ వీడ్కోలు

అమలాపురం, మేజర్ న్యూస్ : నిబద్ధత, నిజాయితీగా పనిచేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌కు పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో పోలీస్ పెరేడ్ నిర్వహించి ఆయన సేవలకు తగు గౌరవాన్ని అందించారు.

అమలాపురం డిఎస్పీగా, కోనసీమ ఎస్పీగా పని చేయటం తన అదృష్టంగా భావిస్తున్నాను అని ఎస్పీ శ్రీధర్ అన్నారు. అందరి సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి బాషా తోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

కాకినాడ, మేజర్‌న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జూలై 17వ తేదీన అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలుస్తారు. మొదటగా ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐ.సి.సి) రోమ్ స్టాట్యూట్ పదవ వార్షికోత్సవం సందర్భంగా 2008లో ఇంటర్నేషనల్ జస్టిస్ డేను సెలబ్రేట్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అడ్వకేట్ లయన్ రాజమహంతి రవిశంకర పట్నాయక్, యమ్.ఎస్.సి., యమ్.ఎ.,బి.ఎల్.,అలాగే మాణికిరెడ్డి ఫౌండేషన్ స్థాపకుడు డా॥ మాణికిరెడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారని అన్నారు. అలాగే తమ విద్యార్థులకు న్యాయపరమైన అంశాలను వివరించి,వారి క్షేమం, అభివృద్ధి పలు అంశాలను చర్చించినందుకు ముఖ్య అతిథులకు సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడ్వకేట్ రాజమహంతి రవిశంకర పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థినులకు ఐ.పి.సి 498, సెక్షన్ 12,13, ఆర్టికల్ 18,21ఇలాపలుసెక్షన్లు మరియుపోక్సో,దిశా, నిర్భయ, డొమెస్టిక్ వైలెన్స్, లా ఆఫ్ ఇగ్నోరెన్స్ వంటి పలు చట్టాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా॥మాణికి రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవాభావం అలవరుచుకోవాలని, ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ యూనిట్‌ని అభినంధించారు. అంతేకాకుండా వాలంటీర్లకు సర్టిఫికేట్స్ మెడల్స్ ను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ఎన్.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్. వాలంటిర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్

అమలాపురం,మేజర్‌న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతని రాజమహేంద్రవరం జిల్లా కోర్టు కార్యాల యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్ నుందు మర్యాదపూర్వకంగా కలిశారు.

సమాజానికి రోటరీ సేవలు అవసరం - టిక్కు

కాకినాడ,మేజర్‌న్యూస్:సమాజ అవసరాలను ఎప్పటికపుడు అవగాహన చేసుకుంటూ సేవాకార్యక్రమాలు నిర్వహించడం ద్వారారోటరీ సంస్థకు మంచి గుర్తింపు వస్తుందని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎల్.సత్యనారాయణ (టిక్కు) అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శిగా దామెర శ్రీకాంత్ భాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక కాస్మాపాలిటిన్ క్లబ్‌లో మిత్రబృందంఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిక్కు మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ స్పాన్సర్ చేసిన గోల్డెన్ జూబ్లీ క్లబ్ నేడు అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మారుతున్న సమాజ అవసారాలకు అనుగుణంగా క్లబ్ అధ్యక్షులు మరియు సభ్యుల సహయ సహకారాలతో వినూత్న కార్యక్రమాలను నిర్వహిం చాల్సిం ది సూచించారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణతోపాటు మెక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాల్సిందిగా కోరారు. రోటరి తోపాటు పలు సంస్థలలో పరిచయం వున్న మీరు అందరి సహకారంతో విశేష కార్యక్రమాలు చేపట్టిన యడల సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ వీర్రాజు తోపాటు పలువురు మిత్రులు పాల్గొని అభినందనలు తెలిపారు.

బిజెపి జిల్లా హార్టికల్చర్ సెల్ కన్వీనర్‌గా శ్రీను

గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ : బిజెపి జిల్లా హార్టికల్చర్ సెల్ కన్వీనర్‌గా గొల్లప్రోలు పట్టణానికి చెందిన పడాల శ్రీను నియమితులయ్యారు. మంగళవారం అన్నవరంలో జరిగిన జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంలో నాయకులు శ్రీనును హార్టికల్చర్ సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు శ్రీనుకు నియామక పత్రాలు అందజేశారు. శ్రీను ప్రస్తుతం బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో శ్రీను గొల్లప్రోలు మండల బిజెపి అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రవిరాజా, జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సింగిలిదేవి సత్తిరాజు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లిశెట్టి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు జీలకర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. శ్రీనును జిల్లా హార్టికల్చర్ సెల్ కన్వీనర్ గా నియమించడం పట్ల భారతీయ జనతా పార్టీ గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, పలువురు స్థానిక బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గానికి ఒక పాయింట్ చొప్పున ఉచిత ఇసుక స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేయాలి

- ఏఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు అంజిబాబు

గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక పాలసీ విధానం వైసీపీ పాలసీ విధానంగానే ఉందని ఎఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కుంచె అంజి బాబు పేర్కొన్నారు. మంగళవారం గొల్లప్రోలు తాహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ భూటకపు వాగ్దానాలకు మరో మచ్చుతునకగా ఆయన పేర్కొన్నారు. వైసీపి ప్రభుత్వ హయాంలో లారీ ఇసుక 12,000 రూపాయలు ఉంటే ఇప్పుడు అదే విధంగా ఉందని వివరించారు. ప్రభుత్వం ఇసుక నియోజకవర్గ కేంద్రాల్లో స్టాక్ పాయింట్‌లు పెట్టి తక్కువ ధరకు ఇస్తే పేదలు సంతోషిస్తారని తెలిపారు. ఉచితం ఉచితం అంటూ ప్రజలను మభ్యపెట్టవద్దని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయంలో శ్రద్ధ వహించి ప్రజలకు ఉచిత ఇసుక పాలసీ విధానం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంజిబాబు కోరారు. ఇసుక పాలసీ విధానం పేదలకు మరింత చేరువ చేయ్యాలని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు గుడాల చార్లెస్, కేసవరపు వీరన్న, శివ, బొడ్డు వెంకటరమణ తదితరులు నాయకత్వం వహించారు.

సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై దిశా నిర్దేశం - కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల వసతి గృహాలలో మరమ్మత్తులను గుర్తించి, వాటికి సీఎస్ఆర్ నిధులను కేటాయించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ విడిది కార్యాలయ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖల అధికారులకు సంక్షేమ వసతి గృహాల నిర్వహణా పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమ వసతి గృహాల నిర్వహణా, మౌలిక సదుపాయాలు విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి అని స్పష్టం చేశారు. విద్యా విధానంలో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఆయా వసతి గృహాల నిర్వహణ కూడా ఒక ప్రధాన అంశం అన్నారు. వివిధ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వసతి గృహాలపై ప్రతికూల కథనాలు వస్తున్నాయనీ , సరైన నిర్వహణ వ్యవస్థ దిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. వసతి గృహాలలో తక్షణం చేపట్టాల్సిన మరమ్మత్తులను గుర్తించి, వాటికి సీ ఎస్ ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులను కేటాయించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదన సిద్ధం చేసి నివేదిక అందజేయాలన్నారు. త్వరలో వాటిపై సమగ్రంగా చర్చించ నున్నట్లు తెలియ చేసారు. ఈ సమావేశం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎమ్. సందీప్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని కె ఎస్ జ్యోతి, కొవ్వూరు బిసి సంక్షేమ అధికారి కే. రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు - డిపిఓ కొండలరావు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయితీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవండి అల్లూరి సీతారామరాజు జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు హెచ్చరించారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం, పెదగెద్దాడ, రంపచోడవరం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అలాగే స్థానిక పిఎంఆర్‌సి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని అందరు డిఎల్‌పిఓలు, పంచాయతీరాజ్ అధికారులకు ఏఎస్ఆర్ డిపిఓ కొండలరావు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో స్థానికంగా సీజనల్ వ్యాధులు, డయేరియా, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై తీసుకోవలసిన చర్యలు, ముందస్తు ప్రణాళికలపై అవగాహనతో పాటుగా ప్రణాళిక పై చర్చించడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో హై రిస్క్ గ్రామాలను గుర్తించి అక్కడ వారానికి ఒకసారి లార్వా మందు పిచికారి, ఫాగింగ్ చెయ్యాలని డిపిఓ కొండలరావు ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఎల్ పిఓ రాఘవన్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం ప్రతీఒక్కరూ కార్యాచరణ అమలు చెయ్యాలని ఆదేశించారు. ఎఎంఓ శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు. మలేరియా విభాగం ఈ సమావేశంలో, మలేరియా, డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన, స్ప్రే చేయవలసిన మందుల వివరాలు, వాడు క్రమం గురించి వివరించారు.

చిడిపి గ్రామంలో కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు

- క్షేత్రస్థాయిలో శానిటేషన్ నిర్వహణ పరిశీలన

కొవ్వూరు,మేజర్‌న్యూస్ : సీజనల్ వ్యాధుల నియంత్రణా, ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టడంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది పనితీరు కీలకం అని కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, గత శనివారం ఓ హెచ్ ఆర్ ట్యాంకులు నిర్వహణాలో భాగంగా ఎన్ని ట్యాంకులు పరిశుభ్రం చేశారని, వాటిలో ఏ సచివాలయ సిబ్బంది ఏ ట్యాంకును పరిశీలించడం జరిగిందని అడిగారు.

ట్యాంకు ఎవరి చేత శుభ్ర పరచడం జరిగిందీ వివరాలు తెలుసుకున్నారు. నీటి ట్యాంకు శుభ్ర పరచడంతో పాటు, శానిటేషన్‌నిర్వహణాసమాంతరంగా నిర్వర్తించా ల్సి ఉంటుందనీ ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని వివరిం చగా,గ్రామంలో సిసిరోడ్స్ మంజూరు చేసినప్పుడే సమాంతరంగా డ్రైనేజీ వ్యవస్థకు చెందిన పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ పర్యటనలో భాగంగా సచివాలయం సిబ్బంది పంచాయతీ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడడం జరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా కోసం సిల్ట్ తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట గ్రామసర్పంచ్‌పాలడుగుల లక్ష్మణరావు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు, బాలల పరిరక్షణకు "మిషన్ శక్తి" అవగాహనా ర్యాలీ

సామర్లకోట, మేజర్ న్యూస్ : మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు వంటి ఇబ్బందుల నుంచి వారిని పరిరక్షించేందుకు "మిషన్ శక్తి" కార్యక్రమం ఎంతగానో తొడ్పడుతుందని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె ప్రవీణ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సామర్లకోట, పెద్దాపురం ప్రాజెక్ట్‌ల పరిధిలోని అంగన్వాడీలకు మారిన మహిళా చట్టాలు, మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, బాలల అక్రమ తరలింపులు తదితర అంశాలపై అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. వందరోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా సిడిపివో ఉష అధ్యక్షతన జరిగిన సదస్సులో పిడి ప్రవీణ ముఖ్య అతిథిగా విచ్చేసి పాల్గొన్నారు. సమాజంలో మహిళల పై వేధింపులు జరిగితున్నట్టు, బాలలు అదృశ్యం అవుతున్నట్టు గానీ, బాల్య వివాహాలు జరుగుతున్నా, పని ప్రదేశంలో వేధింపులకు గురవుతున్నా చైల్డ్ లైన్ హెల్ప్ ట్రోల్ ఫ్రీ నెంబరు 1098/112 కు ఫిర్యాదులు చేసే విధంగా మహిళలకు, యువతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సి డబ్ల్యూసీ సభ్యురాలు జంగం సంతోష్ కుమారి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ బి లక్ష్మి, బిపిఎ ప్రవీణ తదితరులు పాల్గొని క్రిమినల్ లా, మారిన చట్టాలపై అంగన్ వాడీ లకు అవగాహన కల్పించారు. దీనికి ముందు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమం లో ఇంకా సెక్టార్ సూపర్ వైజర్‌లు ఉమ, మంగ, చంద్రకళ, బేబీ, వెంకటలక్ష్మి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ లు పాల్గొన్నారు.

ఎంపి పుట్టా,ఎమ్మెల్యేలు చింతమనేని, మద్దిపాటి చిత్రపటాలకు పాలాభిషేకం

పెదవేగి,మేజర్‌న్యూస్:గతఎన్నికల్లో ఏలూరుఎంపీఅభ్యర్థిగా ప్రచారం చేస్తున్న పుట్టామహేష్‌కుమార్ యాదవ్ దెందులూరు నియోజకవర్గం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు తమకు ద్వారకాతిరుమలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలంకావాలని అభ్యర్థించారు. ఎన్నికల్లో గెలిచినవెంటనేస్థలంకేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆపై ఎంపీగా విజయం సాధించిన పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తాను ఇచ్చిన హామీ విషయాన్ని మరువకుండా నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనువుగా స్థలంకేటాయింపునకుచర్యలుతీసుకున్నారు.

దీనిపైనాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తూ పెదవేగి మండలం విజయరాయిలోని నాయీబ్రాహ్మణులసంఘం కార్యలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు చింతమనేని ప్రబాకర్, మద్దిపాటి వెంకటరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి,తమ అభిమానాన్ని చాటుకున్నారు.

మలేరియా జ్వరాలు నివారణకు చర్యలు

రంపచోడవరం,మేజర్‌న్యూస్ : ఏజెన్సీ గ్రామాల్లో మలేరియా తదితర జ్వరాల నివారణకు ప్రజలు సహకరించాలని రంపచోడవరం ఇన్చార్జి అడిషనల్ డిఎం & హెచ్ఓ డాక్టర్ శిరీష విజ్ఞప్తి చేశారు. మలేరియా స్ప్రేయింగ్ జరుగుతున్న దేవీపట్నం మండలం జి.తాటివాడ గ్రామాన్ని ఇన్చార్జి అడిషనల్ డిఎం & హెచ్ఓ డాక్టర్ శిరీష మంగళవారం సందర్శించి, స్ప్రే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

అనంతరం అదే గ్రామంలో మలేరియా కేసు ట్రీట్మెంట్ క్రమాన్ని పరిశీలించారు. ప్రతీ కేసు ట్రీట్మెంట్ పూర్తి అయిన తరువాత వారంరోజులపాటు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. రంపచోడవరం మండలం గిన్నేపల్లి గ్రామంలోని ఎయిడెడ్ స్కూల్ ను సందర్శించి పిల్లల ఆరోగ్యం గురించి పాఠశాల మేనేజ్మెంట్‌తో మాట్లాడారు. స్థానిక ఆశా కార్యకర్త వారానికి ఒకసారి స్కూల్‌ను సందర్శించాలని అడిషనల్ డిఎం & హెచ్ఓ డాక్టర్ శిరీష సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఏఎంఓ శ్రీనివాసు రాజు, దేవీపట్నం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపూర్వ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్త, ఎంఎల్‌హెచ్ఎం, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎటపాక ఎస్సై పార్థసారధి

ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు ఎటపాక మండల పరిధిలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు నిర్వహిస్తే సాహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఎటపాక ఎస్సై పార్థసారధి ఓ ప్రకటనలో తెలిపారు. జూదం అనే వ్యసనం ప్రజల యొక్క జీవితాలను నాశనం చేస్తుందని, కొంతమంది కష్ట పడకుండా డబ్బులు సంపాదించడానికి పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు ఆడుతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన అన్నారు. మండలంలో ఎక్కడైనా, ఏ గ్రామంలో అయినా పేకాట, కోడి పందాలు లాంటి జూదలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనేవారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండలంలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన తెలిపారు.